రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన

- సమన్యాయ పాలన జగన్‌తోనే సాధ్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- సిద్ధం సభకు తరలిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

రాజమహేంద్రవరం రూరల్: భారత రాజకీయాల్లో రాజ్యాంగబద్ధ పాలన అన్ని వర్గాలకు అందాలని ఆలోచించి, ఆచరించిన నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, రాజమహేందరవరం రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన సిద్ధం సభకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో కలసి బస్సులో ఆయన బయలుదేరారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ భారత రాజకీయాల్లో రాజ్యాంగబద్ధ పాలన అవసరాల్లో ఉన్న వర్గాలకే అందాలని, ‘మనం పాలకులం కాదు సేవకులం’ మాత్రమేనని వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి నింపారన్నారు. ఆయన వెంట నడిచే వైఎస్సార్ సీపీ శ్రేణులకు, ప్రజలకు నమ్మకం, గౌరవం, విశ్వాసం కలిగేలా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 4 సంవత్సరాల 8 నెలల పూర్తయిన అనంతరం మరలా ఎన్నికలకు సిద్ధం అయ్యే తరుణంలో ప్రజా సేవకు సైన్యాన్ని సిద్ధం చేసే సభను ఏలూరు జిల్లా దెందులూరులో ‘సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వేలల్లో వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. సిద్ధం సభను విజయవంతం చేయాలని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ సిద్ధం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రూరల్ నియోజకవర్గం నుంచి సిద్ధం సభకు వెళ్లే బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడియం, రూరల్ మండలం, నగరపాలక సంస్థ పరిధిలో రూరల్ డివిజన్ల నుంచి పార్టీనేతలు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



రూరల్ నియోజకవర్గం నుంచి సిద్ధం సభకు వెళుతున్న బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి, జిల్లా ఇన్‌చార్జి వేణు

సీఎం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలకు మేము సిద్ధం అంటూ రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల స్థానంతో ఒంటరిగా పోటీ చేసేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభకు రాజమంహేంద్రవరం నుంచి భారీగా పార్టీ శ్రేణులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాలను ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం లోక్‌సభ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఒంటరిగా ఎన్నికల సమరంలో తలపడటానికి సిద్ధంగా ఉందని, మరి టీడీపీ, జనసేనలు 175 అసెంబ్లీ స్థానాలలో ఒంటరిగా తలపడేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నేరుగా బటన్ నొక్కి జమ చేస్తున్నారని, అటువంటి జననేతను ఈవీఎంలలో బటన్ నొక్కి మరోసారి సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు బహిరంగ సభకు గట్టిగా వస్తే నాలుగైదు వేలు రావడం గగనమని, అదే జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడ బహిరంగ సభ నిర్వహించినా లక్షలాది ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారన్నారు. ప్రతిపక్షాలకు ఒక అజెండా ఉండదని, వైఎస్సార్ సీపీ సిద్ధం అంటే అందుకు మేము సిద్ధం అని కాపీ కొట్టే స్లోగన్లు తప్పిస్తే మరొకటి చేతకాదని ఎంపీ భరత్ రామ్ ఎద్దేవ చేశారు.



సీఎం సభకు వెళుతున్న నాయకులతో ఎంపీ భరత్‌రామ్, రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్



సిద్ధం బహిరంగ సభకు వెళ్లే పార్టీ శ్రేణులకు దేవరపల్లి మండలం రామన్నపాలెం వద్ద భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ

బుచ్చయ్యా ఆపు నీ అబద్ధాల గోల

వయసు మీద పడినా గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అబద్ధాలు మాటలాడడం ఆపలేదని, అజ్ఞానంతో మాట్లాడుతూ గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారని ఎంపీ భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) విషయంలోను, నగరంలో ఆరు ఎఫ్ఓబీల గురించి, ఔటర్ రింగ్ రోడ్ శాంక్షన్ విషయంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలన్నారు. వాస్తవమని నిరూపిస్తే మీడియా సాక్షిగా బహిరంగంగా అయనకు క్షమాపణలు చెబుతానని, లేదంటే గోరంట్ల తప్పు ఒప్పుకోవాలన్నారు. డిజైన్ ఏ మాత్రం చూడని గోరంట్ల మోరంపూడి ఫ్లై ఓవర్ గురించి మాట్లాడడం దుర్మార్గమన్నారు. అమరావతిలో రాజధాని కట్టినట్టుగా అన్నీ గోరంట్ల ఊహించుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ఆరు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు అప్పటి ఎంపీ మురళీమోహన్ హయాంలో శాంక్షన్ అయితే అవి నేను క్యాన్సిల్ చేయించానని గోరంట్ల మాట్లాడడం దారుణమన్నారు. బుచ్చయ్య అంటున్న వాటికి శాంక్షన్ ఆర్డర్స్ చూపించాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రస్తుతం కొన్ని సాంకేతిక కారణాలతో ఆగిందన్నారు. త్వరలోనే జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఖండిస్తున్నాం



రమణయ్య మృతికి సంతాపం తెలుపుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విశాఖ జిల్లా కొమ్మాదిలో విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య సంఘటనను కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తదితరులు తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో రమణయ్య మృతికి రెండు నిముషాలు మౌనం పాటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను, హత్యలను ఖండిస్తున్నట్టు రెవెన్యూ సంఘ సంఘ నాయకులు పేర్కొన్నారు. దోషులను సాధ్యమైనంత తొందరగా అరెస్ట్ చేసి, శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, రెవెన్యూ సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకునేందుకు చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని బిక్కవోలులో అనధికార లాకౌట్ ప్రకటించిన బ్లూ క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ బిక్కవోలు సంస్థలో పని చేసే ఉద్యోగులు, కార్మికులను అన్ని విధాల ఆదుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు జేసీ తేజ్ భరత్ తెలిపారు. శనివారం జేసీ ఛాంబర్‌లో బిక్కవోలు బ్లూ క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారి, కంపెనీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కార్మిక యూనియన్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లూ క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేసిన కార్మికులకు, ఉద్యోగులకు పెన్షన్, గ్యాట్యూటీ తదితర అన్ని చెల్లింపు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకునివెళ్లి తగిన పరిష్కారం చేసి సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ ఎం.వలీ, డిప్యూటీ కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస రావు, బలబద్రపురం గాయత్రీ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎ.నాగేశ్వర రావు, బ్లూ క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్ర ప్రజాపత్, కార్మిక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను రాజ్యాధికారం వైపు నడిపేది జగన్

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ చొల్లంగి సత్యగిరి పేర్కొన్నారు. శనివారం ఆయన ధవళేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీసీలను కుల వృత్తులు చేసుకునే వ్యక్తులగానే చూసేవాడన్నారు. మొట్టమొదటి సారిగా సీఎం జగన్ బీసీలను పెద్దపీట వేసి అధిక సంఖ్యలో బీసీలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్నారన్నారు. రాజ్య సభకు అధిక సంఖ్యలో బీసీలను పంపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాన్ని గతంలో బీసీలకు కేటాయించారని ఇప్పుడు కూడా బీసీలపై తన కున్న అభిమానాన్ని చాటారన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని డాక్టర్ చొల్లంగి సత్యగిరి పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే

కడియం: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థేనని సర్వశిక్షాభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. ఏపీ సర్వశిక్షాభియాన్ ఆదేశాల మేరకు రాజానగరం, రంగంపేట, అనపర్తి, రాజమహేంద్రవరం, రూరల్, బిక్కవోలు మండలాలకు చెందిన మాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు అనుకరణ శిక్షణా తరగతులు స్థానిక హైస్కూలు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణను శనివారం సుభాషిణి పర్యవేక్షించి, మాట్లాడారు. బోధనలో వస్తున్న మార్పులను, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఐఎఫ్‌బీ బోర్డులు, టాప్స్, దీక్ష యాప్, ఈ కంటెంట్ సమాచారం విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి ఆర్‌పీగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేఖ వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయులు టి.సత్యనారాయణ, లజపతిరాయ్ పర్యవేక్షిస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

కడియం: మురమండ గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ మేరకు వివరాలను శనివారం స్థానిక విలేకరుల సమావేశం వెల్లడించారు. అక్కడ పేకాడుతున్న పి.అమ్మిరాజు, ఎస్.శివాజీగణేష్, ఆర్.ఆదినారాయణ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిచ్చిన సమాచారం మేరకు శాక పట్టాభి, గుత్తుల వాసు, గణపతి, సుబ్బు, శివ పరారైనట్లు గుర్తించామన్నారు. వీరిలో పట్టాభి, వాసు, గణపతి, సుబ్బులు పేకాట శిబిరం ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తులసీధర్ వెల్లడించారు. కాగా అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.5,880 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు మోటారుసైకిళ్లు, కారు, ఆటోను సీజ్ చేశామన్నారు.

టాపర్లతో సెల్ఫీ దిగిన అర్బన్ డీఐ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సెల్ఫీ విత్ టాపర్స్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అర్బన్ డీఐ బి.దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో ఎఫ్ఏ-3 టాపర్స్‌తో ఆయన శనివారం సెల్ఫీ దిగారు. ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ 3 మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను విద్యార్థులకు అందజేయాలని ఆయన ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థితో ఉపాధ్యాయుడు ఫొటో తీసుకోవడం వల్ల ఆ విద్యార్థితో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, అంతేకాకుండా మిగిలిన విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తోందన్నారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు అందరికీ తెలియ చేయడమైందన్నారు. జిల్లా స్థాయి పర్యవేక్షక బృందాలు పాఠశాలలను సందర్శించి, నివేదికను జిల్లా విద్యా శాఖాధికారికి అందజేస్తారన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులను అప్డేట్‌గా ఉంచాలన్నారు. ప్రాథమిక స్థాయిలో వర్క్ బుక్, ఉన్నత పాఠశాలల్లో నోట్ బుక్స్ అన్నీ అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు దిద్ది, విధిగా సంతకం చేయాలన్నారు. ఉన్నతాధికారుల సూచనలు ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులకు తెలియచేయడం జరుగుతోందని, కనుక అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులుగుర్త దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెల్ఫీ విత్ టాపర్లతో డీఐ దిలీప్‌కుమార్

పిల్లల ఆరోగ్య అలవాట్లపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం సిటీ: పిల్లల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకోని శనివారం కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీల విజేతలు కలెక్టర్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సేవ్ గర్ల్స్ చైల్డ్ నినాదంతో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000, మూడో బహుమతి రూ.2000తోపాటు ప్రశంసా పత్రం, మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేప్రసి నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన కలెక్టర్ మాధవీలత

ఎస్‌కేవీటీలో డ్రాయింగ్ పోటీలు

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూలులో బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో బాలికలకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. చిత్రలేఖనంలో పదో తరగతి విద్యార్థి కె.ప్రవల్లిక మొదటి బహుమతి, తొమ్మిదో తరగతి విద్యార్థి జీవీ కావ్య వ్యాసరచనలో రెండో బహుమతి సాధించిందని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. వక్తృత్వంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్.మహాలక్ష్మి రెండో బహుమతి సాధించిందన్నారు. వీరికి కలెక్టర్ కె.మాధవీలత ప్రశంసాపత్రం, మెమెంటో, నగదు అందజేశారన్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ పి.బాపిరాజు, ఏఎల్ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రకాశం నగర్: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే రామచంద్ర తెలిపారు. శనివారం కళాశాలలోని జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఎం. లీలావతి, పి.చంద్రకళ, జి.యశోదాదేవి ప్రథమ స్థానం పొందారని, ఖోఖోలో లక్ష్మీనరస మొదటి స్థానం సాధించి, విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. కళాశాలకు చెందిన పి.సాయి శ్రీయ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం, ఎం.వెంకటేష్ ఖోఖోలో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. క్రీడా విభాగాధిపతి ఎం ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘జోనల్ లెవెల్ ఐక్వెస్ట్’

కంబాలచెరువు: సరికొత్త విద్యా విధానాలతో శ్రీచైతన్య స్కూల్స్‌లో జోనల్ లెవెల్ ఐక్వెస్ట్ వేడుకలు ఘనంగా జరిగాయని ఆ విద్యా సంస్థల ఏజీఎం యంవీ.సురేష్ శనివారం తెలిపారు. శ్రీచైతన్య జోనల్ లెవెల్ ఐక్వెస్ట్ ముగింపు వేడుకలు మోరంపూడి లోని స్కూలు ఆవరణలో శనివారం జరిగాయన్నారు. చిత్రలేఖనం, క్విజ్, అబాకస్, సంగీతం వంటి అనేక రకాల సృజనాత్మక కళలపై జోనల్ లెవెల్ పోటీలు జరగ్గా, వీటిలో కాకినాడ, అమలాపురం, పాలకొల్లు, రాజమండ్రి విద్యార్థులు పాల్గొని వివిధ రకాల నృత్య, క్రీడా విన్యాసాలతో అలరించారన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ఈస్ట్‌జోన్ డీఎస్పీ డాక్టర్ కిశోర్‌కుమార్ హాజరయ్యారన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఇలాంటి టాలెంట్ షో లో కూడా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ మేనేజ్మెంట్‌ను అభినందించారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ స్వామి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. శ్రీ చైతన్య స్కూలు రీజనల్ ఇన్‌చార్జులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం సిటీ : స్త్రీ, పురుష లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వైద్య, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా డీకాయిట్ ఆపరేషన్ ఆకస్మికంగా నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశాలిచ్చారు. డెకాయిట్ ఆపరేషన్ చేసే సమయంలో హాస్పిటల్లో వారికి తెలియకుండా ఆకస్మికంగా వెళ్లి తనిఖీ నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల సమయంలో స్థానిక పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు సంయుక్తంగా సమన్వయంతో చేయాలన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పీసీపీఎస్ డీటీ చట్టం అమలు చేయడంపై జిల్లా అప్రాప్రియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జననాల సమయంలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో తక్కువ ఉన్న వాటిని గుర్తించడంతో పాటు లింగ నిష్పత్తి సమతుల్యం కావడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో 148 స్కానింగ్ సెంటర్లో ఉన్నాయని కొత్తగా మూడు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కోసం, ఆరు రెన్యువల్స్ కోసం, మూడు మోడిఫికేషన్ కోసం అనుమతుల కోరాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఎమ్ హెచ్ వో డాక్టర్ ఎన్. వసుంధర, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయ్ కుమారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐ సి శంభు ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్వోలు శ్రీహరి ,సంధ్య ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

అవగాహనతోనే క్యాన్సర్ మరణాలు తగ్గుముఖం

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్‌పై అవగాహన కలిగి ముందస్తు చికిత్స ప్రారంభిస్తే మరణాలు తగ్గించవచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2022లో దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా కొత్త కేసులు వెలుగు చూసినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) గణాంకాలు వెల్లడించాయన్నారు. ఆ కారణంగా 9 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా మరణాల రేటును గణనీయంగా తగ్గుతుందన్నారు. పురుషుల్లో పెదవి, నోరు, ఊపిరితిత్తులు, అన్నవాహిక క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్), అండాశయానికి సంబంధించిన క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. అత్యధిక మరణాలకు ఈ రకాలే కారణమైనట్టు డబ్ల్యూహెచ్‌వో గుర్తించిందన్నారు. ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ రాకుండా కాపాడుతుందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ ప్రధాన అధికారి డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కలిగి ఉండడంతో పాటు, పొగాకు, మత్తు పదార్థాలను దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాలీలో వైద్యాధికారులు డాక్టర్ కేవీ ఫణి మాధవీ, డాక్టర్ సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్రబాబు, డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ జి.స్రవంతి, శ్రీనివాసమూర్తి, శివప్రసన్న, పేరయ్య శాస్త్రి, ఆర్.శ్రీనివాస్, మొదటి ఏడాది మెడికోలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు, అధికారులు

16 నుంచి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ స్థానిక నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహిస్తున్నట్లు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు డి.త్రినాథ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16 నుంచి ప్రారంభమయ్యే ఈ చాంపియన్ షిప్ పోటీల్లో మేన్, ఉమెన్ విభాగంలో, సింగల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పోటీలు జరుగతుతాయన్నారు. 35 ఏళ్ల పై బడిన వారి నుంచి 75ఏళ్ల వారు అర్హులని తెలిపారు.

పూజిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పని ఒత్తిడికి తాళలేక తనువు చాలించిన బాపట్ల జిల్లాలోని వ్యవసాయ శాఖ గ్రామ సహాయకులు పూజిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వేణుమాధవ రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రాజమహేంద్రవరం సబ్ డివిజన్‌కు చెందిన వీఏఏ, వీహెచ్ఏ అసోసియేషన్ సభ్యులు దుర్గబాబు నేతృత్వంలో పూజిత చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వీఏఏలు వేణుమాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు వేణుమాధవరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎరువుల గిడ్డంగులు పూర్తి స్థాయిలో నెలకొల్పకుండా ఎరువుల అమ్మకాలు చేపట్టాలని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి వీఏఏల పై ఒత్తిడి తీసుకురావడం దురదృష్టకరమన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల పని భారాన్ని తగ్గించాలని పూజిత ఆత్మహత్యకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వేణుమాధవరావు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ఆందోళనకు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండల వ్యవసాయ అధికారి భీమరాజుకు కూడా వీఏఏలు వినతి పత్రం సమర్పించారు. ఏఈఓ రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి పీటర్, మాజీ జిల్లా సంఘ అధ్యక్షులు జీఎం శాంత కుమార్, సునీల్, వి ఏ ఏ సంఘ సభ్యులు రాహుల్, నాగబాబు, సురేఖ, హేమంత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



వేణుమాధవరావుకు వినతిపత్రం అందజేస్తున్న దుర్గబాబు వీఏఏలు, వీహెచ్ఏలు

షాడే లీజుపై ఏఈఎల్‌సీని సంప్రదించి ప్రచారం చేయండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): షాడే గర్ల్స్ హైస్కూలు క్యాంపస్‌లో ఉన్న స్థలంలో కిమ్స్ హాస్పటల్ సబ్ లీజుతో నిర్మాణ పనులు చేస్తోందని, దానిని వక్రీకరించి కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆ ఆసుపత్రి డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు పేర్కొన్నారు. షాడే స్థలంలో ఆసుపత్రి నిర్మాణంపై మీడియాలో అసత్యాలు చెబుతూ కొందరు చేసిన ఆరోపణలను వారు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. స్వార్థపూరిత ప్రయోజనాలతో షాడే ఆస్తులు అన్యాక్రాంతం అంటూ కొందరు వ్యక్తులు ఏఈఎల్‌సీకి, రిజిస్టర్ లీజు తీసుకున్న పులవర్తి విజయలక్ష్మి, సబ్ లీజుదారు కిమ్స్ ఆసుపత్రికి మధ్య జరిగిన ఒప్పందాలు తెలియకుండా అవాస్తవాలను మీడియాకు చెబుతున్నారన్నారు. ఈ విధమైన అసత్యప్రచారాలు చేసిన వారిపై చట్టపరంగా ముందుకువెళుతున్నామన్నారు. షాడే స్థలంలో ఆసుపత్రి నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పిస్తున్నా, అసత్య ప్రచారం చేసినా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.